సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు రాంభూపాల్

చంద్రబాబు పాలన మోసపూరితం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకులు రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

మోసపూరిత హామీలతో చంద్రబాబు పాలన సాగుతోందని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు రాంభూపాల్ విమర్శించారు. అనంతపురం నగరంలోని అంబేద్కర్ భవన్ లో రెండవ రోజు ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి సమావేశాలు జరిగాయి ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు రాంభూపాల్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో రాకముందు అనేక హామీలు ఇచ్చారన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా అమ్మ ఒడి పేరు మారుస్తూ తల్లికి వందనం పేరుతో తాము అధికారంలోకి వస్తే ప్రతి ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 15వేల రూపాయల ప్రకారం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు మరిచిపోయి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు గురించికాని, విద్యగురించి మాట్లాడడం లేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వ విద్య రోజురోజుకూ నిర్వీర్యం అవుతోందని అన్నారు. విద్యావ్యవస్థను బలపర్చాలంటే అందరూ కలిసి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అదేవిధంగా మెడికల్ విద్య పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి విడ్డూరంగా ఉందన్నారు. తాము మెడికల్ నిర్వహించలేమని ఎన్ఎంకికు చంద్రబాబు గారు లేఖ రాయడం వలన 7వందల సీట్లు రాష్ట్రం నష్టపోయిందన్నారు. అదే విధంగా మరో 11 కళాశాల నిర్మాణం ఆపాలని ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఆదేశాలు చేయడాన్ని బట్టి చూస్తే పేద మధ్య తరగతి విద్యార్థులకు వైద్యం విద్యకు దూరం చేయడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్ష మంది విద్యార్థులు లక్షల రూపాయలు ఖర్చు చేసి నీట్ కోచింగ్ వెళ్తున్నారన్నారు. ఇలాంటి సందర్భంలో మెడికల్ కళాశాలలు చాలా అవసరమన్నారు. ఇందుకోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్, ఉపాధ్యక్షులు పరమేష్, రామ్మోహన్, కిరణ్, వినోద్, వెంకటేశ్వర్లు, అబ్దుల్లా, రవి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు రిజర్వేషన్ ఏదీ.?

మద్యం దుకాణాల్లో పది శాతం ఉత్తిదేనా .? నిరాశలో గీతకార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని అమల్లోకి తీసుకురానుంది. ఈ మేరకు ప్రక్రియను మొదలు పెట్టింది. గతంలోనున్న ప్రభుత్వ దుకాణాల స్థానంలో ప్రయివేటుకే అప్పగించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడమే కాకుండా దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈనెల తొమ్మిదవ తేదీతో దరఖాస్తుల స్వీకరణ ముగియనుంది. ఒక్కో దుకాణానికి రెండు లక్షల రూపాయల మొత్తాన్ని చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అనంతపురం జిల్లాలో 136 దుకాణాలకు టెండర్లు పిలువగా సత్యసాయి జిల్లాలో 87 దుకాణాలకు పిలిచారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం నడుస్తోంది. అయితే కొత్త మద్యం పాలసీని అమలు చేస్తామని ప్రకటించిన సమయంలోనే గీత కార్మికులకు పది శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఆచరణలో ఈ హామీ ఏమైందన్న దానిపై స్పష్టత లేదు. అన్ని మద్యం దుకాణాలకు ఒకే పద్ధతిలో టెండర్లు ఆహ్వానించారు.

పది శాతం రిజర్వేషన్ ఉత్తిదేనా ?

కల్లు గీత కార్మికులకు న్యాయం చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పడమే కాకుండా ఎన్నికల అనంతరం క్యాబినేట్‌లో దీనిపై నిర్ణయం చేశారు. అయితే గెజిట్ నోటిఫికేషన్ విడుదల సమయంలో చూస్తే ఎక్కడా కల్లు గీత కార్మికులకు మద్యం దుకాణాలు రిజర్వు చేసినట్టు కనబరచలేదు. జనరల్ కేటగిరిలోనే దరఖాస్తులు ఆహ్వానించారు. దీంతో కల్లుగీత కార్మికుల్లో ప్రధానంగా ఈడిగ సామాజికవర్గం వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేస్తామని ప్రకటించి నోటిఫికేషన్‌లో ఆ అంశమే లేకపోవడంతో చెప్పిన మాట ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

అనంతపురం జిల్లాలో సుమారు మూడు వేల మందికిపైగా గీత కార్మికులున్నట్లు అంచనా. అయితే గుర్తింపు కార్డులు మాత్రం 430 మంది వరకు ఇచ్చారు. గీత కార్మిక సహాకార సంఘాలు కూడా జిల్లాలో ఉన్నాయి. ఇవి సుమారు 19 వరకు ఉన్నాయి. సంఘాలు కాకుండా వ్యక్తిగతంగా ఒక్కొక్కరుగానున్న వారూ ఉన్నారు. వీరందరూ ఈ రిజర్వేషన్ వలన మద్యం దుకాణాలు దుక్కుతాయని ఆశలు పెట్టుకుని ఉన్నారు. కల్లుగీత ఇటీవలి కాలంలో తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాల ద్వారానైనా లబ్ధిపొందవచ్చునని వారు భావించారు. ప్రతిపక్షంలో ఉండగా హామీనివ్వడమే కాకుండా అధికారంలోకి వచ్చాక కూడా ప్రకటన చేయడంతో ఆ ఆశలు మరింతగా పెరిగాయి. తీరా ఆచరణలో చూస్తే అవేవీ అమలు జరిగే పరిస్థితులు కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం పది శాతమంటే అనంతపురం జిల్లాలో 13 దుకాణాలకుపైగా రిజర్వేషన్ కేటగిరిలో కనబరచి టెండర్లు పిలిచి ఉండాలి. కాని అటువంటిదేది లేకపోవడంతో కల్లుగీత కార్మికుల్లో తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సర్వం కల్తీమయం

- కారం నుంచి నెయ్యి వరకూ...
- అడ్డదారి తొక్కుతున్న తయారీదారులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా జిల్లాలో కారం నుంచి నెయ్యి వరకు అన్నీ కల్తీల మయంగా మారుతున్నాయి. వినియోగదారుల ఆరోగ్యాన్ని విస్మరించి తయారీదారులు ఆహారపదార్థాల్లో కల్తీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యావసరాలు మొదలుకొని ప్రతి వస్తువులోకి కల్తీలను చేరుస్తున్నారు. నూనె, నెయ్యి. శనగపిండి వంటి వాటితోపాటు చివరికి ధనియాలు, బఠాణీలు వంటి వాటిని కూడా వదలడంలేదు. ఒకరకంగా చెప్పాలంటే కల్తీ కేంద్రాలు కుటీర పరిశ్రమల్లా వెలిశాయి. అరికట్టాల్సిన, అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసరాలు, నూనెలు, నెయ్యి తదితరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఏది కొనాలన్నా భారంగానే ఉంది. ఇదే అదనుగా కల్తీ వ్యాపారులు విజృంభిస్తున్నారు. పట్టణంలో వంట నూనె వ్యాపారులు నిబంధనలకు తిలోదకాలు పలికారు.కల్తీ వంట నూనె వ్యాపారాలు జోరుగా చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇంత వరకు ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోక పోవడంపై ఈ విమర్శలకు బలం చేకూర్చుతోంది. గతంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో వంట నూనెల వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి పాత సరుకు గోదాముల్లో దాచి కొత్త ధరలు ముద్రించి విక్రయించి సొమ్ముచేసుకున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం లీటరు మంచినూనెపై రూ.15 పెంచింది. లూజ్ విక్రయాలు చేయకుడదన్న నిబంధనలను లెక్క చేయకుండా దర్జాగా లూజ్ విక్రయాలు చేస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని నూతన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ముందర ఇద్దరు నూనె వ్యాపారులు, పరిగి రోడ్డులో ఉన్నా నూనె వ్యాపారి పెద్ద ఎత్తున గోదాములో వంట నూనె నిల్వ చేసుకుని లూజ్ విక్రయాలు చేస్తున్నారు. ఇందులో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఒక వ్యాపారికి ప్యాకింగ్ అనుమతి ఉందని అతనే ప్యాకింగ్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్యాకింగ్ చేసిన పాకెట్‌లో ఏలాంటి నూనె ఉందో ఎవరికి అర్థం కావడం లేదు. గతంలో అధికారులు తరచూ తనిఖీలు చేస్తుండేవారు. దీంతో ఎక్కడో ఒకదగ్గర మాత్రమే కల్తీలు జరుగుతుండేవి. అయితే ఇప్పుడు తనిఖీలు జరగడంలేదు.. ఒకవేళ ఎవరైనా వచ్చినా వారిని సంతృప్తి పరచి కేసులు లేకుండా చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. దీంతో కల్తీలు రోజురోజుకు అధికమవుతున్నాయి. కల్తీల దెబ్బకు ఇంట్లో తయారు చేసుకునే పదార్థాల వల్ల ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది. పండుగల సమయంలో కల్తీలు తీవ్రంగా జరుగుతున్నాయి. కల్తీలు ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నా వ్యాపారులకు ఇది పట్టడంలేదు. పాలు, నెయ్యి, నూనెల కల్తీలతో కేన్సర్ తదితర తీవ్రమైన వ్యాధులు కూడా వస్తున్నాయి. కల్తీ ఆవనూనె వల్ల ఇటీవల ఢిల్లీలో 33 మంది డ్రాప్సీకా అనే కాలేయానికి సంబంధించిన వ్యాధి బారిన పడ్డారు. వంటనూనె, నెయ్యి, కొబ్బరినూనె వంటి వాటిని ప్యాకింగ్, ముద్రణ వివరాలు లేకుండా లేకుండా విక్రయించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వీటి లూజు విక్రయాలను పూర్తిగా నిషేధం విధించింది. అయితే జిల్లాలో మాత్రం లూజు విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పండుగల సమయంలో నెయ్యి, వంటనూనె వాడకం అధికంగా ఉంటుంది. కేజీ నెయ్యి రూ.800 వరకు ఉండటంతో స్వార్థ వ్యాపారుల దృష్టి కల్తీ నెయ్యిపై పడింది. పిండివంటల్లో వాడే బెల్లంలో 90 శాతం కల్తీనే ఉంటుంది. జిల్లాలో కల్తీదారులపై తనిఖీలు, దాడులు చేసేందుకు ఆహారభద్రతా విభాగానికి తగినంత మంది సిబ్బంది లేరు. నిబంధనల ప్రకారం అర్బన్ పరిధిలో ప్రతి 50 వేల మందికి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి లక్షమందికి ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. ఈ లెక్క ప్రకారం జిల్లాకు 50 మందికి పైగా సిబ్బంది ఉండాలి. కానీ ఉమ్మడి జిల్లాలో నలుగురు మాత్రమే ఉన్నారు.

పిండి వంటల్లోనూ కల్తీలు

ప్రస్తుతం ఎక్కువమంది సాంప్రదాయ వంటలను స్వీట్ల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. పిండి వంటల తయారీలో ఎక్కువ శాతం కల్తీనూనె, నెయ్యిలనే వాడుతున్నారు. వీటి విక్రయాలు ఇటీవల అధికమయ్యాయి. వీటి నాణ్యతా ప్రమాణాలను అంచనా వేయడం, అరికట్టడంలో అధికారులకు సమస్యగా మారింది. సవరించిన ఆహార భద్రతా ప్రమాణాల చట్ట ప్రకారం అమ్మకానికి ఉంచిన స్వీట్లపై తయారీ వివరాలను ముద్రించాలి. అయితే జిల్లాలో ఏ ఒక్క వ్యాపారి పిండి వంటలపై వివరాలను ముద్రించడం లేదు.

ఫిర్యాదు చేసే అవకాశం....

సవరించిన చట్ట ప్రకారం స్వీట్లు, పిండివంటలు పాడైతే కూడా ఫిర్యాదు చేయవచ్చు. గతంలో ఇటువంటి నేరాలకు పాల్పడిన వారికి జరిమానాలతో సరిపెట్టేవారు. 2019 సవరించిన చట్టప్రకారం రుచిగా లేని, గడువులోపే పాడైపోయే వాటిని అమ్మితే రూ.5 లక్షల జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సవరణలు చేసింది. పదార్థాలు కొనుగోలు చేసినప్పుడు రశీదును తీసుకుంటునే ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుంది.

కల్తీ ఇలా....

గోధుమ పిండిలో మైదా, శనగపిండిలో బఠాణీ పిండి కలుపుతున్నారు. పిచ్చికుసుమ గింజలు కలిసిన ఆవనూనెను వంటల్లో వాడుతున్నారు. నెయ్యిలో ఆవు ఎముకల నుంచి తీసిన తేటను కలుపుతున్నారు. బరువు కోసం బంగాళ దుంపలను నీళ్లలో ఉడికిస్తే వచ్చే నీటిని కలుపుతున్నారు. స్వచ్ఛమైన నెయ్యి చలికాలంలో గడ్డకడుతుంది. కానీ మార్కెట్‌లో లభించే నెయ్యిలో ఇటువంటి గుణం కనిపించడం లేదు. కందిపప్పులో శ్రీకాకుళంలో దొరికే కేసరి పప్పు అనే పదార్థాన్ని కలుపుతున్నారు. ఇది తినడం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అరిశెలు, ఇతర స్వీట్లు తయారు సమయంలో వాటి రంగు మరింత అకర్షణీయంగా కనబడటానికి మెటానిల్ అనే కెమికల్‌ను వాడుతుంటారు. ఇవి కలిసిన పదార్థాలను తినడం వల్ల జీర్ణవ్యవస్థ పూర్తిగా దెబ్బతిని క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంటుంది.

ఫుడ్‌లైసెన్స్ నెంబర్లను ముద్రించాలి

ఆహార పదార్థాల సంబంధిత వ్యాపారాలు నిర్వహించే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బిల్లులు, టాక్స్ ఇన్వాయిస్‌లపై ఫుడ్‌లైసెన్స్ నెంబర్‌ను తప్పని సరిగా ముద్రించాలి. స్వీట్ల తయారీదారులు వాటిపై తయారీ వివరాలను ముద్రించాలి. నిబంధనలు పాటించని వారిపై కేసులతో పాటు రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అధికారం సంబందిత అధికారులకు ఉంది. దీంతో లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించే వారికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు, రూ.5 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ఆహార పదార్థాల తయారీ, విక్రయాల వార్షిక టర్నోవర్‌ను మే 31లోపు ఆన్‌లైన్‌లో ఢిల్లీకు పంపాల్సి ఉంది. అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వ్యాపారులు ఇందులో ఒక్క నిబంధన కూడా పాటించడం లేదు.

నూతన మార్కెట్ ఎదురుగా ఉన్నా షాపులో లూజ్ పామాయిల్ విక్రయిస్తున్న దృశ్యం

పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం

16 నుంచి 5 ఇసుక రీచ్‌ల నుంచి పంపిణీ
పట్టా భూముల్లో ఇసుక ఉంటే వినియోగంలోకి తెస్తాం
కలెక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉచిత ఇసుక విధానం అమలుపై ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు వర్షాకాలం వల్ల పనిచేసేందుకు వీలు ఉండేది కాదని, అక్టోబర్ 15వ తేదీ తర్వాత జిల్లాలో ఉన్న 5 ఇసుక రీచ్‌లు మాన్యువల్ ఆపరేషన్‌లో ఉంటాయన్నారు. రాష్ట్రంలో అన్ని చోట్ల ఇది మొదలవుతుందన్నారు. అక్టోబర్ 15వ తేదీ తర్వాత ఇసుక రీచ్ లు ఆపరేట్ చేస్తామన్నారు. దీంతోపాటు ఎవరికైనా పట్టా భూమిలో ఇసుక రీచ్ లు ఉంటే ఇసుకను డికాస్ట్ చేసి ఉపయోగించుకోవచ్చని, వినియోగదారులకు ఇవ్వాలనుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని వాడుకలోకి తీసుకొస్తామన్నారు. జిల్లాలో అవసరమున్న ఇసుకను బట్టి రాబోయే మార్చి 2025 వరకు ఇసుక పంపిణిపై ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రవాణాచార్జిల ధర ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా ఉందని, అందరి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని రాష్ట్రం మొత్తం ఒక యూనిఫామ్ రేట్లను ఇవ్వడం జరిగిందని, ఇందుకు సెప్టెంబర్ 14న జీవో 52 ఇవ్వడం జరిగిందన్నారు. రవాణాదారులు ఎక్కువ ధర అడిగితే వినియోగదారులు మోసపోకుండా ఉండేందుకు ఈ పద్ధతిని పెట్టడం జరిగిందన్నారు. రవాణా చార్జీలకు సంబంధించి 0-10 కిలోమీటర్లకు ట్రాక్టర్ కు (4.5 మెట్రిక్ టన్నులు) 13.5 రూపాయలు, 6 టైర్ కు (10 మెట్రిక్ టన్నులు) 10.7 రూపాయలు, 10/12 టైర్ వాహనాలు (18/20 మెట్రిక్ టన్నులు) 9.4 రూపాయలు నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే 10-20 కిలోమీటర్లకు ట్రాక్టర్ కు (4.5 మెట్రిక్ టన్నులు) 12.8 రూపాయలు, 6 టైర్ కు (10 మెట్రిక్ టన్నులు) 10.2 రూపాయలు, 10/12 టైర్ వాహనాలు (18/20 మెట్రిక్ టన్నులు) 8.9 రూపాయలు నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. ఇసుక బుకింగ్ కు సంబంధించి ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ విధానాన్ని సిఎం ప్రారంభించారన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఇసుక కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో అక్టోబర్ 15వ తర్వాత 16వ తేదీకి ఇసుక పంపిణీ మొదలుపెడుతున్నామన్నారు. 3,750 మెట్రిక్ టన్నుల ఇసుక రోజుకు సరఫరా చేయగలిగే ప్రణాళిక ఏర్పాటు చేశామన్నారు. ఆన్లైన్ సిస్టంపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలన్నారు. రీచ్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, త్వరలోనే స్టాక్ యార్డుల వద్ద వే బ్రిడ్జి పెట్టనున్నట్లు వివరించారు. ప్రతి వాహనం ఎక్కడికి వెళ్తుంది అనేది తనిఖీ చేస్తామన్నారు. ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను కేటాయించడం కోసం ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వ, బ్లాక్ మార్కెటింగ్‌పై రోజువారీగా కేసులు రిజిస్టర్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ల సమన్వయంతో పని చేస్తున్నామని, జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. డయల్ 100, 102కి ఫోన్ చేసి ఎక్కడైనా అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతుంటే ఫిర్యాదులు చేయవచ్చని, ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో జుంజురాంపల్లి ఇసుక రీచ్ క్లోజ్ అవుతుందన్నారు. రేపటి నుంచి కనేకల్ మండలంలోని రచ్చుమర్రి స్టాక్ పాయింట్ మొదలవుతుందన్నారు. యల్లనూరు మండలంలోని చిలుమకూరు, గార్లదిన్నె మండలంలోని ఇల్లూరు, కంబదూరు మండలంలోని కర్తనపర్తి, బ్రహ్మసముద్రం మండలంలోని అజయదొడ్డి, కణేకల్ మండలంలోని రచ్చుమర్రి ఇసుక రీచ్‌ల్లో 2,02,716 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఏవైనా ఫిర్యాదులకు సంబంధించి హెల్ప్ లైన్ నెంబర్ 1800-425-6039 మరియు మైన్స్ డిడికి చెందిన 08554-298380 అనే నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. ఈ సమావేశంలో మైన్స్ డీడీ వెంకటేశ్వర్లు, ఏజి ఆదినారాయణ, తాడిపత్రి ఎడి ఓబుల్‌రెడ్డి, రాయల్టీ ఇన్స్‌పెక్టర్ కవిత, తదితరులు పాల్గొన్నారు.

బళ్ళారి-హొస్పేట్ విభాగంలో రైల్వే అభివృద్ధి పనులకు రూ.6200 కోట్లు

రైల్వే, జల వనరుల శాఖ మంత్రి సోమన్న

ప్రజాశక్తి - రాయదుర్గం

కర్నాటక ప్రాంతంలో బళ్ళారి- హొస్పేట్ విభాగంలో రైల్వే అభివృద్ధి పనులకు రూ.6200 కోట్ల నిధులు కేటాయించినట్లు కేంద్ర రైల్వే, జలవనరుల శాఖ మంత్రి వి. సోమన్న చెప్పారు. ఆదివారం బళ్లారి నగరంలోని పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన రైల్వే, రెవెన్యూ అధికారుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బళ్లారి- హొస్పేట విభాగంలో వివిధ రైల్వే అభివృద్ధి పనులకు ప్రాముఖ్యత ఇచ్చినట్లు చెప్పారు. కొత్త రైలు మార్గాలకు సర్వే పనులు పూర్తి చేసి డిపిఆర్ రూపొందించినట్లు తెలిపారు. బళ్ళారి-రాయదుర్గం- చిక్క జాజురీరు రైలు మార్గం 185 కిలోమీటర్ల డబ్లింగ్ పనులకు రూ.3,080 కోట్ల నిధులు కేటాయించామని ఇప్పటికే సర్వే పూర్తికాగా రెండేళ్లలో పనులు పూర్తి చేయనున్నామని వివరించారు. స్వామిహళ్లి- రాయదుర్గం కొత్త రైలు మార్గం నిర్మాణానికి సాంకేతిక సర్వే జరుగుతోందని త్వరలోనే డిపిఆర్‌ను రూపొందిస్తామని తెలిపారు. కర్నాటక రాష్ట్రంలో 21 రైలు మార్గ నిర్మాణ పనులు జరుగుతున్నాయనివీటికి రూ.43వేల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు వివరించారు. దేశంలో అన్ని జిల్లా కేంద్రాలలో ఉన్న రైల్వే స్టేషన్లను ఎయిర్‌పోర్టు స్థాయిలో అభివృద్ధి పరచనున్నట్లు చెప్పారు. రైల్వే శాఖలో 12 లక్షల పోస్టులు ఖాళీగా ఉండగా వీటిని భర్తీ చేయడానికి నోటిఫికేషన్లు జారీ చేశామని అన్నారు. కర్నాటక రాష్ట్రంలో కన్నడ మీడియంలో రైల్వే పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించినట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో బళ్లారి ఎంపీ తుకారం, బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, బళ్లారి మేయర్ ముల్లంగి నందీష్, రైల్వే, రెవెన్యూ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర రైల్వే, జలవనరుల శాఖ మంత్రి వి.సోమన్న

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్



ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

రైతులను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం రైతులకు ఎన్నో ప్రోత్సాహాలు అందిస్తోందని, ఇటీవల ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల విరివిగా పండ్ల తోటల పెంపకం సాగిస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : పండ్ల తోటల సాగుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి?

జవాబు: అతివృష్టి, అనావృష్టి చేత ఇటీవల చాలామంది రైతులు పంటలు సాగు చేయలేక పండ్లతోటల పెంపకం పైన మక్కువ చూపుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెట్ట భూముల్లో ఉద్యాన పంటలు సాగుకు ఆసక్తి చూపే రైతులు పంట రకాన్ని బట్టి మొక్కలు కొనుగోలు, గుంతలు తీసింది మొదలు పంట దిగుబడి వరకు వివిధ దశల్లో అయ్యే ఖర్చులను మూడు నుంచి రెండేళ్లపాటు ప్రభుత్వం భరించనుంది. ఐదు ఎకరాల లోపు నీటి వసతి ఉన్న రైతుల్లో గతంలో లబ్ధి పొందని వారందరూ ఈ పథకానికి అర్హులు. సాధారణ పంట తోటలతోపాటు గులాబీ ,మల్లె, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్స్ ,వంటి 18 రకాల పండ్ల మొక్కలు పెంచేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.

ప్ర : పండ్ల తోటలో పెంపకానికి ప్రభుత్వం నిర్వహణ ఖర్చులు ఇస్తుందా ?

జ: ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు మొక్కలు కొనుగోలు, రవాణా, గుంతలు తీయడం మొక్కలు నాటేందుకు అయ్యే కూలీల ఖర్చులు ఇస్తారు. ఒక్క మొక్క సంరక్షణకు 4.25 రూపాయల చొప్పున వంద మొక్కలకు 425 రూపాయల ప్రకారం నెలకు నాలుగు విడతలు కలిసి మస్టర్ల రూపంలో రూ. 1700 రైతులకు అందిస్తారు. పాదులు తీసి నీరు పెట్టేందుకు మరో రూ. 3500 ఇవ్వనున్నారు. ఇలా మొత్తం రూ.5200 వరకు రైతులు పొందవచ్చు. ఎరువులకు ఆరు నెలలకు ఒకసారి రూ.3వేలు ఇస్తారు. నిర్వహణ ఖర్చుల కింద ఉపాధి పని దినాలను బట్టి మూడేళ్లపాటు ప్రభుత్వం చెల్లిస్తుంది. మామిడికి మొదటి ఏడాది రూ.45,279, రెండవ ఏడాది 29,926 మూడో ఏడాది 27,986 మూడేళ్లకు మొత్తం రూ. 1,03,193 చెల్లిస్తారు. మునగ ,పూల తోటలకు రెండేళ్లు, మిగిలిన పండ్ల మొక్కలకు మూడేళ్లు, నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారు.

ప్ర : పండ్ల తోటల పెంపకం దారులకు వర్షాకాలం అనుకూలమా ?

జ: వర్షాకాలం పండ్ల మొక్కల పెంపకానికి ఎంతో అనుకూలం. ఇప్పుడు నాటితే వందశాతం మొక్కలు బతుకుతాయి. రైతులకు దాదాపు ఆరు నెలలను నీటిని అందించే శ్రమ ఉండదు. నాటిన ప్రతి మొక్క బతుకుతుంది. మెట్ట భూముల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. మల్లె, గులాబీ ,డ్రాగన్ ఫ్రూట్స్, మునగ మొక్కలు నాటేందుకు అవకాశం ఉంది. ఆసక్తికి ఉన్న రైతులు ఆయా మండలాల్లోని ఉపాధి పథకం ఎపిఒను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్ర : పండ్ల తోటల రైతులకు ఏయే పంటలకు ఎంత నష్టపరిహారం అందిస్తారు?

జ: సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 2022 -23 సంవత్సరంలో కురిసిన వర్షాలకు 25 ఎకరాలలో పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులకు పంట నష్టం జరిగింది. అత్యధికంగా కాయగూరల పంటలైన టమోటాకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 110 ఎకరాల్లో టమోటా పంట నాశనమైంది. నష్టపరిహారం బొప్పాయికి ఎకరాకు రూ.15వేలు, అరటికి రూ. 25 వేలు, మామిడికి ఎకరాకు రూ. 20వేలు కొత్తిమీర పంటకు రూ.7,200ల నష్టపరిహారం రైతులకు అందిస్తాం.

ప్ర : గత నాలుగు సంవత్సరాల నుండి నష్టపోయిన రైతులకు ఏ విధంగా ఆదుకుంటున్నారు?

జ: పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి అందిస్తున్నాం. గత ఐదు సంవత్సరాల నుండి ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తున్నాం. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నివేదికలను ప్రతి సంవత్సరం అందజేస్తున్నాం. వీటికి తోడు సబ్సిడీ ధరలకు స్ప్రింకర్లు, స్ప్రేయర్లు, పైపులు, డ్రమ్ములు, పాథలిన్ పట్టలు, రైతులకు సబ్సిడీతో అందిస్తున్నాం.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పామిడి : పది రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందిన పట్టణంలోని 13వ వార్డుకు చెందిన బెస్త గోపాల్ కుటుంబానికి టిడిపి నాయకులు ఆదివారం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు బొమ్మ మోహన్‌కృష్ణ, రంగనాయకులు, హుస్సేన్‌పీరా, శ్రీరాములు, నారాయణస్వామి, చీమల రాము, గోవర్ధన్‌రెడ్డి, వడ్ల ఓబులేసు, హనుమంతురెడ్డి, అరవ శ్రీనివాసరెడ్డి, వలి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

In The Court of The Ist Addl. Junior Civil Judge, Ananthapuramu
O.S.No:840/2023
Between:
Andhra Pragathi Grameena Bank, Rep by its Branch Manager, Nirmala Convent, Ramachandra Nagar, Ananthapuramu ...Plaintiff
And
Chakali Pawan Kumar and another ...Defendants
Notice to Defendant No: 2
D2:Vadde Sankaraiah S/o Hanumappa, Business, D.No:13-1-905-2, Revenue Colony, Ananthapuramu
పై నెంబరు కేసులో 2వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 27/11/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
G.KESAVAIAH, Advocate, Ananthapuram.Cell:9440606489

In The Court of The Prl. District Judge, Ananthapuramu
Cr.A.No:33/2024
Between:
Smt.Kancham Reddy Malleswaramma Memorial Educational Society, (Akshara International School) Rep.by its K.Jagadeeswara Reddy, Director, Akshara International School, Garladinne (V) and (M) Ananthapuramu (Dist) ...Appellant/Accused
And
A.Chandra Sekhar Rao and another ...Respondants/Complainats
Notice to Respondant No:1
R1:A.Chandra Sekhar Rao S/o A.Shankar Rao, R/of H.No:11-1-408, Aravinda Nagar, Ananthapuramu.
పై నెంబరు కేసులో 1వ రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం 14/10/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
A.SURESH KUMAR, Advocate, Ananthapuram.Cell:9440204098

In The Court of The Prl. Junior Civil Judge, Ananthapuramu
O.S.No:134/2023
Between:
UCO Bank Rep by its Branch Manager, Raju Road, Ananthapuramu ...Plaintiff
And
N.Sai Leela and another ...Defendants
Notice to Defendant No:1 & 2
D1:N.Sai Leela D/o N.Rajendra Prasad,
D2:Nallabothula Rajendra Prasad Both are R/of D.No:3-11, Tapovanam, Ananthapuramu.
పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం 26/11/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
T.RAJARAM, Advocate, Anantapuramu. Cell:9440286323

In The Court of The Senior Civil Judge, Gooty
E.P. No:25/2022 in O.S. No:241/2014
Between :
B.Chandra Sekhar ...Petitioner/D.Hr
And
P.Parveen ...Respondant/J.Dr
To,
Penukonda Parveen D/o P.Sadiq Ali, Working as Supervisor, SBR Vehicle Finance and Insurance, Tadipatri Town, Ananthapuramu.
J.Dr కి Order 21 Rule 22 & 64 CPC Notice
డిక్రీ హోల్డరుకు రావలసిన E.P. మొత్తము వసూలు చేయుటకు గాను E.P.లోని షెడ్యూలు ఆస్తిని జప్తు చేసి యున్నారు. సదరు E.P. వేలము షరతులు నిర్ణయించుటకు మీ హాజరు నిమిత్తం 14/10/2024 వ తేదిన వాయిదా వేసి యున్నారు. అందుకు మీకు ఆక్షేపణలున్న యెడల సదరి దినము ఉదయం 10:30 గం॥లకు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు హాజరు కావలెను.లేని యెడల మీ పరోక్షము నందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
A.KRISHNAIAH, Advocate, Tadipatri
T.DHANUNJAYA, Advocate, Gooty

అధికారులు మారినా..
షరా మామూలే..!

ఉదయం 5 గంటలకే తెరుచుకుంటున్న బార్లు
పట్టించుకోని ఉన్నతాధికారులు
మామూళ్లే కారణమన్న ఆరోపణలు



అనంతపురంలో ఉదయమే తెరుచుకున్న బార్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

కేవలం అధికారులే మారారు.. కానీ నగరంలోని బార్ల యజమానుల తీరుమాత్రం మారలేదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమ మద్యాన్ని అరికట్టడానికి ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఏర్పాటు చేసింది. ఎక్సైజ్ శాఖలోని అధిక భాగం ఉద్యోగులను సెబ్‌కు కేటాయించింది. అయినా మద్యాన్ని నియంత్రించకపోగా ఇంకా ఎక్కువ అయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వంలో మద్యం షాపులను ప్రభుత్వమే నడిపేది. అప్పట్లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకూ ప్రభుత్వ షాపులు తెరిచి ఉంచేవారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని నిబంధన ఉండేది. దీన్ని బార్ల యాజమాన్యాలు తమకు వరంగా మార్చుకుని ఉదయం 10 నుంచి రాత్రి 11 వరకూ బార్లు తెరవాల్సి ఉండగా ఉదయం 5 గంటలకే తెరుచుకుంటున్నాయి. ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు అందడంతోనే ఈ దందా ఇన్నేళ్లు యథేచ్ఛగా జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా గత ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీని రద్దు చేసి మద్యం షాపులను తిరిగి ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు టెండర్లు పిలిచారు. ఇందులో భాగంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెబ్‌ను రద్దు చేసి ఉద్యోగులందరినీ తిరిగి ఎక్సైజ్ శాఖకు బదిలీ చేసింది. దీంతోపాటు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, సూపరింటెండెంట్, సీఐలు, ఎస్ఐలు అందరూ బదిలీ అయ్యి కొత్తవారు వచ్చారు. దీంతో కొత్త అధికారులైనా బార్లను కట్టడి చేస్తారని సంతోషపడ్డారు. కానీ కొత్త అధికారులు వచ్చినా బార్లు ఉదయం 5 గంటలకే తెరుచుకుంటున్నాయి. దీంతో కొత్త అధికారులు సైతం మామూళ్లకే మొగ్గు చూపారా.. లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలోని 8 బార్లలో మొదట్లో రెండో, మూడో ఉదయం తెరుచుకునేవి. ప్రస్తుతం అన్ని బార్లూ అదేబాటలో నడుస్తున్నాయి. దీంతో ఉదయాన్నే చాలామంది చిన్నా.. చితకా పనులు చేసుకుని బతికేవారు తమ సంపాదనను తాగుడుకే ఖర్చు చేస్తున్నారు. దీంతో ఇళ్లల్లో గొడవలు జరిగి కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుని బార్లను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
సిఐటియు నాయకురాలు నాగమణి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇటీవల మండలవ్యాప్తంగా వర్షాలు కురిసి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిఐటియు నాయకురాలు నాగమణి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి మండలవ్యాప్తంగా దాదాపు 8వేల ఎకరాల్లో పంట నష్టం సంభవించిందన్నారు. దీనికితోడు ఇళ్లల్లోకి నీరు చేరి 500 కుటుంబాలు కట్టుగుడ్డలతో బయటపడ్డారన్నారు. ఈనేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలకు వెళ్లి నష్టం అంచనాలు వేసి కలెక్టర్‌కు నివేదికలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.20వేలు ఆర్థికసాయం అందించాలని, ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్న వారికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇకపోతే వర్షాలు వచ్చి నష్టపోయిన తర్వాత వెళ్లి పరామర్శించి అంతోఇంతో సాయం చేసేకంటే ముందుగానే అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపడితే బాగుటుందని సూచించారు.

రేషన్ దుకాణం ప్రారంభం

కుందుర్పి : మండల పరిధిలోని ఆపిలేపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ చౌకధాన్యం (37) దుకాణాన్ని ఎమ్మెల్యే అల్లుడు దేవినేని ధర్మతేజ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మతేజ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ సరుకులు సకాలంలో ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మల్లికార్జున, మాజీ సర్పంచి రాఘవేంద్రబాబు, మాజీ కోఆప్షన్ సభ్యుడు తాహిర్, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, బట్టువనిపల్లి పవన్, ఐదుకల్లు మాజీ సర్పంచి చట్టం రామాంజినేయులు, ఆపిలేపల్లి టిడిపి నాయకులు మాజీ మండల కన్వీనర్ రామాంజినేయులు, అంగడి చలపతి, డీలర్ ఓబులేసు, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, రామిరెడ్డి, వీరూపాక్షి, మంత్రిస్వామి, బొజ్జప్ప, రాము, బోయ చిరంజీవి, లోకేష్, మహదేవ, జయచంద్ర, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

యోగ నరసింహుని అలంకారంలో మలయప్పస్వామి

నార్పల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు ఆదివారం మలయప్పస్వామి సింహవాహనంపై యోగ నరసింహుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా సాగింది. ఉదయం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సింహ వాహనాన్ని అధిరోహించారు. సింహం పరాక్రమానికి, ధైర్యం, తేజస్సు, ఆధిపత్యం, మహాధ్వనికి సంకేతంగా భక్తులు చెబుతారు.

ఎంపిని కలిసిన పుట్లూరు నాయకులు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు సమస్యలను వివరిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన టిడిపి, జనసేన నాయకులు ఆదివారం అనంతపురంలోని నివాసంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎల్లుట్ల గ్రామంలో వాటర్‌ప్లాంట్, గ్రంథాలయం నిర్మించాలని కోరారు. ఎంపిని కలిసిన వాళ్లలో నాయకులు ఆది, కుళ్లాయప్ప, నాగముని తదితరులు ఉన్నారు. ఇందుకు ఎంపి స్పందిస్తూ వాటర్ ప్లాంట్, గ్రంథాలయం నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కొనసాగిన దసరా ఉత్సవాలు

అనంతపురం : దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా నగరంలోని సుభాష్ రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయ భవన్ ప్రాంగణంలో లలితా త్రిపుర సుందరదేవి అలంకారంలో అమ్మవారు ఆదివారం దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఇందులో భాగంగా బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళి అధ్యతన వివిధ సాంస్కృతిక కార్యక్రమంలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ గోల్డ్ బాషా, పాలకవర్గ సభ్యులు రోళ్ల భాస్కర్, మాగిశెట్టి చంద్రశేఖర్, కృష్ణకుమార్, బావిగడ్డి రమణయ్య, సుంకర రమేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వెలసిన వాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారు వేంకటేశ్వరస్వామి ఆదివారం దర్శమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామునే కాల బిందెసేవ జలాలను పెన్నటి గడ్డ భోగేశ్వరస్వామి ఆలయం నుంచి మేళతాళాలతో తీసుకొచ్చి అభిషేకం చేశారు. తర్వాత కుంకుమ అర్చన చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణగావించారు. సర్వ దేవతల భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

రాయదుర్గం : దేవీ నవరాత్రుల్లో భాగంగా 4వ రోజు ఆదివారం పట్టణంలోని నగరేశ్వర స్వామి ఆలయంలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి దేవిని ధనలక్ష్మిగా అలంకరించారు. ఇందులో భాగంగా రూ.45 లక్షల విలువజేసే కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.

యల్లనూరు : దసరా నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారు గాయత్రి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ముందుగా తెల్లవారుజాము నుంచి పూజలు చేశారు. అలాగే గ్రామదేవత పెద్దమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించి దుర్గా మత పూజలు అందించారు.

పుట్లూరు : దసరా ఉత్సవాల సందర్భంగా మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామంలో వెలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో పార్వతీదేవి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. 4వరోజు పార్వతీదేవి చండికాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే 'కథలు'

పుస్తకాల ఆవిష్కరణలో వక్తలు

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

వాస్తవ విలువలు ప్రజలకు తెలియకుండా సమాజంలో పేదలను మార్కెట్ మాయాజాలం ఎలా పిప్పి చేస్తుందో.. ఎలా దోపిడీకి గురి చేస్తుందో.. వాస్తవ ఘటన ఆధారంగా కథలు రాయడం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అరసం అధ్యక్షులు ఈశ్వరరెడ్డి అధ్యక్షతన ఆచార్య వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డిగారి 'చెరువు గండి, జననాయక జయహే, ది గ్రేట్ డిక్లైన్' కథలు పుస్తకాలను ఆవిష్కరించారు. ది గ్రేట్ డిక్లైన్ కథల పుస్తకాన్ని సమీక్ష చేసిన ప్రముఖ విమర్శకులు ఎన్ వేణుగోపాల ప్రసంగిస్తూ రచయిత ప్రపంచ సంక్షోభం వెనుక దాగి ఉన్న సమస్యల గురించి రాశారన్నారు. పౌరుడు వినియోగదారుడుగా, సరుకుకు ఎలా బలి అవుతున్నాడో.. ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ విధానాల వల్ల మన సంస్కృతి ఎలా ధ్వంసం అవుతుందో వివరించారన్నారు. సరుకు ఆర్థిక వ్యవస్థ వ్యక్తిని ఎలా ఉక్కిరిబిక్కిరి చేస్తుందో ఆర్థిక కుట్రలు వీటన్నిటి పర్యవసానమే ఆచార్య వంకిరెడ్డి రెడ్డప్ప రెడ్డి రచించిన ది గ్రేట్ డిక్లైన్ కథలు ఇవి మనిషిని సరుకునుండి విముక్తి చేసే కథలు అని కొనియాడారు. జననాయక జయహే నవలను సమీక్ష చేసిన డాక్టర్ పొదిలి నాగరాజు ప్రసంగిస్తూ రాజకీయ వైజ్ఞానిక నవల అని తెలియజేస్తూ ఎవరూ సృజించని వినూత్న వస్తువుని వస్తువుగా చేసుకుని గొప్ప నవల రాసిన రెడ్డప్పరెడ్డి భవిష్యత్తులో మరికొన్ని నవలలు రాయాలని కోరారు. అలాగే చెరువు గండి నవలన సమీక్ష చేసిన డాక్టర్ కె.నాగేశ్వర ప్రసంగిస్తూ ఈ కథల నిండా ప్రజల సమస్యలు.. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజలను ఎలా పీడిస్తున్నదో తెలియజేసే గొప్ప నవల అని కొనియాడారు. తర్వాత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని సమస్యలు అనేక రూపాలుగా మన ముందు కనిపిస్తున్న సందర్భంలో రెడ్డప్ప రెడ్డి గొప్ప తెలుగు సాహిత్యానికి అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ శాంతి నారాయణ జి.నిర్మల రాణి, నిర్వాహకులు డాక్టర్ నానీల నాగేంద్ర, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, పూజారి ఈరన్న, అమర్నాథ్‌రెడ్డి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు జి.శ్రీధర్, ఎం.ముని నారాయణప్ప, జివి.రమణ, గోసల నారాయణ స్వామి, డాక్టర్ జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, టి.రాజారామ్, టివి.రెడ్డి, అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, సడ్లపల్లి చిదంబరరెడ్డి, ఎ.ఓబుళపతి, నిమ్మల వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకూ సాగునీరివ్వాలి
సిపిఎం నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని చివరి ఆయకట్టు వరకూ సాగునీరు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలం మండల కేంద్రంలోని షాదీఖానాలో సిపిఎం మండల మహాసభ నిర్వహించారు. ఈ సభలో ప్రధానంగా 9 సమస్యలపై తీర్మానం చేశారు. ఇందులో కాలువల్లో పూడిక తీసి చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందివ్వాలని, 150 రోజులు నీరు విడుదల చేయాలని, 2023లో నష్టపోయిన రైతులకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించాలని, పెద్దవడుగూరులో సులబ్‌కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పథకం కింద 200 పని దినాలు కల్పించి రూ.600 కూలి పడేలా చూడాలని, గ్రామాల్లో సిసి రోడ్డు వేయాలని, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, మండల కమిటీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డియాదవ్, మద్దిలేటి, క్రిష్ణ, నారాయణ, మహమ్మద్‌రఫీ, ఇసుక నారాయణ, హమాలీ యూనియన్ నాయకులు రామాంజనేయులు, సునీల్, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మై వజ్ర హైపర్ మార్ట్ ప్రారంభం

మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రవి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న 80 అడుగుల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మై వజ్ర హైపర్ మార్ట్‌ను ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం అన్ని రకాల వస్తువులు ఒకేచోట లభ్యమయ్యేవిధంగా నిర్వాహకులు శ్రీనాథ్ వజ్ర హైపర్ మార్ట్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు శ్రీనాథ్ మాట్లాడుతూ సువిశాలమైన ప్రాంగణంలో అన్నిరకాల గృహోపకరణాలు, కూరగాయలు, పళ్లతోపాటు అన్నిరకాల వస్తువులను మార్ట్‌లో ఉంచినట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రారంభోత్సవం సందర్భంగా 75శాతం వరకూ ప్రత్యేకమైన ఆఫర్లతో సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఇఒ మృతి

మల్లికార్జున (పాతచిత్రం)

రాయదుర్గం : మండల విశ్రాంత విద్యాశాఖ అధికారి మల్లికార్జున ఆదివారం మధ్యాహ్నం మరణించారు. ఉదయం పెన్షనర్ భవన్‌లో తోటి పెన్షనర్లతో సమావేశమై ఇంటికి వెళ్లాడు. ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మల్లికార్జున మృతి చెందినట్లు ప్రకటించారు. మల్లికార్జున మృతికి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఇ.రామాంజనేయులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మల్లికార్జున కుటుంబానికి అసోసియేషన్ తరపున ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రేషన్ దుకాణాల్లో అక్రమాలను అరికట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని నడిమిదొడ్డి రేషన్ దుకాణంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నడిమిదొడ్డిలో దాదాపు ఐదునెలల నుంచి సగటున 26.6 శాతం మంది కార్డులకు రేషన్ ఇవ్వలేదన్నారు. ప్రతి నలుగురిలో ఒకరికి రేషన్ ఇవ్వకుండా పేదల కడుపు కొడుతున్నారన్నారు. అంతేగాకుండా రేషన్ దుకాణానికి వస్తున్న బియ్యంతోపాటు జొన్నలను డీలర్ అక్రమంగా విక్రయించుకుంటున్నాడని ఆరోపించారు. జొన్నలు ఇచ్చామని దాదాపు 560 కిలోల బియ్యాన్ని స్వాహా చేశారన్నారు. నడిమిదొడ్డిలో 626 రేషన్ కార్డులు ఉండగా కార్డుదారులకు ప్రతినెలా 10,945 కిలోల బియ్యం సరఫరా చేయాలి. గత జూన్‌లో 3,365 కిలోల బియ్యాన్ని 154 రేషన్‌కార్డుదారులకు ఇవ్వలేదన్నారు. జూలైలో 3,018 కిలోల బియ్యాన్ని 161 రేషన్‌కార్డుదారులు, ఆగస్టు నెలలో 3,174 కిలోల బియాన్ని 152 రేషన్ కార్డుదారులు, సెప్టెంబర్‌లో 2,447 కిలోల బియ్యాన్ని 138 రేషన్ కార్డుదారులు ఇవ్వలేదన్నారు. అయితే ఈనెలలో 510 రేషన్ కార్డులకు 8,310 కిలోల బియ్యం, 560 కిలోల జొన్నలు పంపిణీ చేసినట్లు సంబంధిత పోర్టల్‌లో నమోదైందన్నారు. ఇంకా 1976 కిలోల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉందన్నారు. జొన్నలు ఒక్క గింజ ఇవ్వకనే 560 కిలోలు ఇచ్చినట్లు బియ్యం ఇచ్చే దానిలో తగ్గించారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్‌డీలర్‌పై చర్యలు తీసుకుని కార్డుదారులందరికీ సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ తీరుపై అసంతృప్తి

రాయదుర్గం : పట్టణంలో ప్రభుత్వ చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ తీరుపై సిపిఐ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని శాంతినగర్, 26, 27వ ఎన్నికల వార్డుల్లో సిపిఐ నాయకులు పర్యటించి రేషన్‌సరుకుల పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు మూడు నెలలుగా దుకాణాల్లో నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని ప్రజలు వాపోతున్నారన్నారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్, నాయకులు నరసింహులు తిప్పే స్వామి, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి

మృతిచెందిన శంకర్

శింగనమల : పిడుగుపాటుకు యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని పెద్దకుంటకు చెందిన రుషింగప్ప కుమారుడు శంకర్ గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే సమీపంలోకి పొలాలకు మేపుకోసం గొర్రెలను తీసుకెళ్లాడు. ఈనేపథ్యంలో సాయంత్రం క్రితం కురిసిన వర్షానికి పిడుగుపాటుకు గురై శంకర్ (27) అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని శోకసముంద్రంలో మునిగిపోయారు. ముఖ్యంగా చేతికి వచ్చిన కుమారుడు మృత్యువాత పడటంతో తండ్రి రుషింగప్ప గుండెలు పగిలేలా విలపించాడు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

మట్కా నిర్వాహకులు అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సిఐ బి.వెంకటేశ్వర్లు

గుత్తి : మట్కా బీటర్ల పై గుత్తి పోలీసులు ముమ్మరంగా దాడులను కొనసాగిస్తున్నారు. ఇటీవల వరుస దాడులతో మండలంలోని పలువురు బీటర్ల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సిఐ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని తొండపాడు గ్రామంలో దాడులు నిర్వహించి మట్కా రాస్తున్న ఎం.కంబగిరి, ఎం.ప్రభావతి, కె.దస్తగిరిని అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ.27, 100 నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులను కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతు, చంద్రానాయక్, కానిస్టేబుల్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పిలో ఏరులైపారుతున్న మద్యం
పెరిగిన అసాంఘిక కార్యకలాపాలు-ఎస్ఐ లేకపోవడమే కారణమా..?

కుందుర్పి పోలీస్‌స్టేషన్

ప్రజాశక్తి-కుందుర్పి

కర్ణాటక రాష్ట్రానికి ఆనుకుని కుందుర్పి మండలం ఉండటంతో మండలవ్యాప్తంగా కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. దీనికితోడు పేకాట, మట్కా పెరిగిపోయింది. నియంత్రించాల్సిన ఎస్ఐ మండలానికి లేకపోవడంతో రోజురోజుకూ అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతూనే ఉన్నాయి. మండలానికి నియమించిన ఎస్ఐ వెంకటస్వామి రెండు నెలల క్రితం సెలవులో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి పర్మినెంట్ ఎస్ఐను నియమించలేదు. దీంతో మండలవ్యాప్తంగా పేకాట, మట్కా వంటి కార్యకలాపాలు సాగుతుండటంతోపాటు కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. కొంతమంది యువకులు మద్యం మత్తులో గ్రామాల్లో రాత్రివేళ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు మండలవాసులు వాపోతున్నారు. చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు, కర్ణాటక మద్యంపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న ప్రజలు ఎస్ఐ లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వీటికితోడు మండలంలో అనేక కుటుంబ సమస్యలు సైతం తాండివిస్తున్నాయి. ఆయా బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వస్తే అక్కడున్న సిబ్బంది ఏదో ఒకటి చెప్పి పంపుతున్నారు. దీంతో సమస్యలు రానురాను పెరిగిపోతూనే ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రజల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీసు ఉన్నత స్థాయి అధికారులు స్పందించి కుందుర్పి పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐ నియమించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డకట్టి వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం
నేమకల్లు (గ్రా), బొమ్మనహాళ్ళు (మం), అనంతపురం జిల్లా.
e-Procurement Tender
NIT NO. REV07/336/2024-B2, Dt:13/03/2024
రాజాగోపురంనకు రంగులు వేయుట కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in. వెబ్‌సైట్‌ను చూడగలరు.
కార్యనిర్వహణాధికారి

శ్రీ రాణి సత్రం
రాయదుర్గం (గ్రామం మరియు మండలం), అనంతపురం జిల్లా.
e-Procurement Tender
NIT NO. REV07/869/2024-B2, Dt:07/07/2024
టాయిలెట్స్ రిపేరు చేయుట కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in. వెబ్‌సైట్‌ను చూడగలరు.
కార్యనిర్వహణాధికారి